ప్రజాశక్తి

మంగళవారం 10 జూన్ 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

విశాఖ నగరంలో నిర్వహించిన భారీ ప్రదర్శనలో సిహెచ్.నర్సింగరావు తదితరులు

తొలగించిన 'ఉక్కు' కాంట్రాక్టు కార్మికులను

విధుల్లోకి తీసుకోవాల్సిందే..

★ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సంఘీభావ కార్యక్రమాలు

★ పోలీస్ నిర్బంధం ఆపాలి : సిహెచ్.నర్సింగరావు

కూర్మన్నపాలెం కూడలిలోని దీక్షా శిబిరం వద్ద నేలపైనే కూర్చొని నిరసన తెలుపుతున్న ఉక్కు కార్మికులు

స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్టు కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సోమవారం కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించారు. ఉక్కు పరిరక్షణ వేదిక ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా వీటిని చేపట్టారు. జిల్లా కేంద్రాలతో పాలు కార్మిక వాడల్లో ర్యాలీలు సాగాయి. ఉక్కు కర్మాగారం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నేతలంతా ఖండించారు. విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్, గురజాడ విగ్రహం, ఆశీలుమెట్ట మీదుగా తిరిగి జివిఎంసి వరకు ప్రదర్శన జరిగింది. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ దీక్షా శిబిరంపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండించారు. (వార్తలు 4లో..)



వార్త 5లో..

విశాఖలో టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి అవార్డు అందజేస్తున్న డోలా

భావితరాలకు షైనింగ్ స్టార్స్ స్ఫూర్తి

అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రులు డోలా, కొల్లు

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

వెబ్ కౌన్సెలింగ్‌పై ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వెబ్ కౌన్సెలింగ్‌కు వ్యతిరేకంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ మెంబర్, యుటిఎఫ్ నాయకులు గొంది చిన్నబ్బాయి, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణారావు, ఎపిటిఎఫ్ 257 జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, కార్యదర్శి మధు శ్రీనివాసరావు, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

వెబ్ కౌన్సెలింగ్‌పై ఉపాధ్యాయుల నిరసన

ఎస్టియు నాయకులు ఇమంది పైడిరాజు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, కార్యదర్శి టి ఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ ఎస్‌జిటిలకు వెబ్ కౌన్సిలింగ్ వద్దని, మాన్యువల్ పద్ధతిలో కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకుని తక్షణమే ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికతో చర్చించి విద్యాశాఖలో నెలకొన్న బదిలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఇచ్చిన హామీని నిలుపుకోవాలని కోరారు.

క్రీడా రంగం వ్యాపారమయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడారంగాన్ని వ్యాపారంగా మార్చేశాయని అఖిల భారత్ యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా అధ్యక్షుడు వై.రాంబాబు విమర్శించారు. ఐపిఎల్ మ్యాచ్ రద్దు చేయాలని, మ్యాచ్ ల ద్వారా కార్పొరేట్ సంస్థలు, ప్రముఖ క్రీడాకారులు బెట్టింగ్ యాప్‌లకు ప్రోత్సాహిస్తూ యువతను బలి చేయడంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలోని బెట్టింగ్ యాప్‌లు, ఐపిఎల్ బెట్టింగ్‌ల వల్ల కోట్లాదిమంది యువత జీవితాలు చిన్నా భిన్నమవుతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బెంగళూరులో ఐపిఎల్ విజయోత్సవ సభలో జరిగిన ప్రమాదంపై విచారణ జరిపి బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.అచ్యుతరావు, జిల్లా నాయకులు ఎన్. మధురెడ్డి, పి.శివకుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌తో గర్భాశయ ముఖద్వార కేన్సర్ నియంత్రణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తొమ్మిది నుండి 14 ఏళ్ల వయస్సు గల ఆడపిల్లలకు సెర్వావాక్ వ్యాక్సిన్ వేయడం ద్వారానే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నియంత్రించగలమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రిటైర్డ్ అధికారి డాక్టర్ సరోజిని అన్నారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ సంయుక్తంగా పాత పోస్టాఫీసు సమీపంలోని మత్స్యకార భవనంలో సోమవారం జర్నలిస్టుల ఆడపిల్లలకు నిర్వహించిన సెర్వావాక్ వ్యాక్సిన్ కార్యక్రమంను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ్యాక్సిన్ ద్వారానే ది హ్యూమన్ పాపిలోమా వైరస్‌ను అరికట్టగలమన్నారు. ఈ వ్యాక్సిన్ వేసుకునే ఆడపిల్లలకు ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్ ఉండవన్నారు. తల్లిదండ్రులు ఈ విషయంలో భయపడాల్సిన పనిలేదని చెప్పారు. 45 ఏళ్ల వయసు వరకు మహిళలు ఈ వ్యాక్సిన్ వేసుకోవచ్చని, క్యాన్సర్ నియంత్రణకు ఇంతకన్నా మరో మార్గం లేదన్నారు. సభకు అధ్యక్షతన వహించిన చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఆడపిల్లల ఆరోగ్య పరిరక్షణకు వ్యాక్సిన్ కార్యక్రమాన్ని చేపట్టామని రెండు డోసులు పూర్తయ్యాయన్నారు. సీనియర్ జర్నలిస్ట్ జి.వల్లీశ్వర్ మాట్లాడుతూ చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ సామాజిక సేవే ధ్యేయంగా ఏర్పాటైందని నాటి నుండి నేటి వరకు లక్ష్యాలను సాధించి అన్ని తరగతులవారిని ఆకట్టుకుందన్నారు. సంస్థ వ్యవస్థాపకులు, డాక్టర్ ఎస్.ఎ.రహమాన్ ప్రస్తుత అధ్యక్షులు షిరిన్ రహమాన్ ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఇటువంటి వ్యాక్సినేషన్ కార్యక్రమాలు నిర్వహించడం ముదావాహమన్నారు. జర్నలిస్టు బులుసు ప్రభాకరశర్మ, వల్లేశ్వర్, సరోజినిలను వుడా మాజీ చైర్మన్ రహమాన్, షిరీన్ రహమాన్ దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు అత్తిలి శంకర రావు, ఎపిడబ్ల్యూజెఎఫ్ విశాఖపట్నం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. నారాయణ్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

యుగంధర్‌పై చర్యలు తీసుకోవాలి

వినతిపత్రం చూపుతూ మాట్లాడుతున్న రాజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉద్యోగాల పేరిట మోసం చేసిన సనపల యుగంధర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ నాయకులు సోమవారం పోలీస్ కమిషనర్‌కు సమర్పించిన వినతి పత్రంలో కోరారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యు.ఎస్.ఎన్ రాజు మాట్లాడుతూ విశాఖ ఎండాడలో ఎస్.యుగంధర్ ఉద్యోగాలు ఇస్తామని కె.గణేష్, పి.లక్ష్మి, కె.ఆదిలక్ష్మి దగ్గర నుంచి రూ.19.40 లక్షలు వసూలు చేసి మోసం చేశాడని తెలిపారు. సనపల యుగంధర్ కలెక్టర్ కార్యాలయంలో ఆఫీస్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని, బాధితులకు చెప్పి ఆఫర్ లెటర్ కూడా చూపించి మోసం చేసారన్నారు. మోసపోయిన బాధితులు తిరగబడటంతో పరారయ్యాడని చెప్పారు. నిందితుడు యుగంధర్‌పై పలు రకాల చీటింగ్ కేసులు ఉన్నాయని, జైలుకు సైతం వెళ్లి వచ్చాడన్నారు. బాధితులకు డబ్బులు రికవరీ చేసేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు.

కొండా రాజీవ్ గాంధీకి పరామర్శ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల ప్రమాదానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీని వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షుల కె.కె.రాజు సోమవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, వైసిపి గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, విశాఖ జిల్లా మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, కార్పొరేటర్ అనిల్ కుమార్ రాజు, సీనియర్ నాయకులు పి.సతీష్ వర్మ, శ్రీదేవి వర్మ, గాలి ప్రసాద్, తదితరులు ఉన్నారు.

యోగాపై అవగాహనా ర్యాలీలు

మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి నగరంపాలెంలో యోగాపై సోమవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మొల్లి హేమలత మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మొల్లి లక్ష్మణరావు, వాండ్రాశి అప్పలరాజు, నాగోతి సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమునిపట్నం : ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ జివిఎంసి మూడో వార్డు పరిధిలో సోమ వారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎగువ పేట స్వాగత ద్వారం నుంచి గంట స్తంభం వరకు ర్యాలీ సాగింది . ఈ కార్యక్రమంలో జెడ్‌సి బమ్మి అయ్యప్పనాయుడు, యుసిడి ఎపిడి వికె.దొర, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూక రాజు, కొక్కిరి అప్పన్న పాల్గొన్నారు.

సీతమ్మధార : 45వ వార్డు తాటిచెట్ల పాలెంలో యోగా ఆంధ్ర ప్రజా చైతన్య ర్యాలీని నిర్వహించారు. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, స్థానిక కార్పొరేటర్ కంపా హనోక్, జనసేన సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. తాటిచెట్లపాలెంలోని పలు కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి యోగా కోసం ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో యుసిడి అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పుణ్యవతి, జనసేన అధ్యక్షులు త్రినాథ్ పాల్గొన్నారు

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలో యోగా అవగాహన ర్యాలీ చేపట్టారు. పిలకవానిపాలెం, ఓల్డ్ పిఎం పాలెం, వాంబే కాలనీ తదితర సచివాలయాల పరిధిలో ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఎన్ఎన్.నాయుడు, కె.అచ్యుతరావు, నాగేశ్వరరావు, శంకర్ పాల్గొన్నారు.

ఆరిలోవ : 12వ వార్డులోని అన్ని సచివాలయ పరిధి వార్డు టిడిపి నాయకులు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గాడి సత్యం, ఏడువాక సన్యాసిరావు, తిమోతి, బండారు శంకర్రావు, జనసేన నాయకులు ఎస్.అప్పారావు అర్పీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

13వ వార్డు టిడిపి నాయకులు ఆరిలోవ కాలనీలో యోగాంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కెల్ల సునీత, సత్యనారాయణ, పొత్రకండ ధర్మారావు, యల్లమిల్లి సురేష్ పాల్గొన్నారు.

గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డులో కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. యోగా సాధన ద్వారా శరీరంలోని అన్ని అవయవాలు ఉత్తేజం చెందతాయని తెలిపారు.

కోటవురట్ల: ప్రతినిత్యం యోగా చేస్తే మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యం మెరుగు పడుతుందని మండల టిడిపి అధ్యక్షులు లింగన్న నాయుడు అన్నారు. సోమవారం ఆయన కొత్తపల్లి గ్రామంలో ఈఓపిఆర్‌డి రఘురాం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

పాయకరావుపేట: పాయకరావుపేటలో యోగాంధ్ర ర్యాలీని అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ , తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చించలపు ప్రదీప్ (పద్దు), పార్టీ పట్టణ అధ్యక్షులు యాళ్ళ వరహాలబాబు పాల్గొన్నారు.

మాడుగుల: ఆరోగ్యానికి యోగా మంచి సాధన మని ఎంపీపీ రాజారామ్ పేర్కొన్నారు. మాడుగుల కేంద్రంలో ఎంపీడీవో కొంకి అప్పారావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాంబిల్లి : యోగా వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమం రాంబిల్లి మండలం ధనదిబ్బలు బౌద్ధ ఆరామాల వద్ద సోమవారం ఉదయం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఇందులో పాల్గొని యోగాసనాలు వేశారు. 12న అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లో నిర్వహించే జిల్లాస్థాయి మెగా యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం అక్కడ నుండి కొత్తూరు వరకు యోగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ షేక్ అయిషా, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఆర్ శిరీషా రాణి పాల్గొన్నారు.

సబ్బవరం : ప్రతి రోజూ యోగాసనాలు వేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని స్థానిక ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుండి ఎంపీడీవో పి.పద్మజ ఆధ్వర్యంలో యోగాంధ్రపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దారు బి.చిన్నకృష్ణ, స్థానిక సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : జర్నలిస్టులకు తన పరిధి మేరకు నిరంతరం అండగా ఉంటానని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, నేవల్ డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు అన్నారు. ఇటీవల జర్నలిస్ట్ సుంకరి రాజా తండ్రి సుంకర పద్మనాభం, తాజాగా పూడి శ్రీనివాస్ తండ్రి రామునాయుడు మరణించగా, సోమవారం వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సుంకర రాజాకు రూ.పదివేలు. పూడి శ్రీనివాస్‌కు రూ.5000, మరో సీనియర్ పాత్రికేయునికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు.

పబ్లిక్ నోటీసు

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్.,
(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమసంస్థ యొక్క అనుబంధ సంస్థ)
రి.నెం., ABC - CS/006/2015

H .O.: ABCCS Endowments Commissionerate Complex, Gollapudi, Vijayawada-521225, Ph: 0866-6650307
BO: ABC-CS, Flat No.F1 HSR Enclave,Opp Andhra Bank, Akkayyapalem, Visakhapatnam - 530016, Ph:0891 -2561655.

ఈ ప్రకటనలోని వారి తాలుకు దిగువ ఉదహరించిన స్థిరాస్థిని సొసైటీ నందు తనఖా పెట్టి అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు స్థిరాస్థి తనఖా పై, సొసైటీ వారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైనను ఎట్టి అభ్యంతరములు ఉన్న ఎడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజులలోపుగా లిఖిత పూర్వకముగా అభ్యంతరములను రిజిస్టర్ పోస్ట్ విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ ద్వారా మా సొసైటీ కు తెలియపరచవలసినదిగా కోరుతున్నాము.

Sl.No.	Applicant Name & Present Residence Address	Description of the Property
1	Smt. APPALLA MADHAVI. GL No : 93780-A W/o. Sri. APPALLA SURESH KUMAR. Cell: 7032521918, 83411 80292	The properity in an extent of 50.83.Sq.Yards, of house site along with ACC roofed ground floor residencial building therein, in Survey. no. 24, Door no: 19 – 62/A, Asst no. 1086514757, Plot.No.77, Near DurgaTemple, Deenadayalapuram, CHINAGADILI Village, Visakhapatnam Rural Mandal, Visakhapatnam District – 530040. Value Rs. 18.24. Lakhs

Visakhapatnam
09-06-2025
Branch Manager,
SRINIVASA RAO TATA 9281029463/9848141269

బహిరంగ ప్రకటన

యిందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా, నా క్లయింటున్నూ అనకాపల్లి జిల్లా, వి.మాడుగుల మండలం & గ్రామ వాస్తువ్యుడు అయిన శ్రీమరుపిళ్ల మోహన్ పాత్రుడు, తండ్రి ఎల్లారావు (న్యాయవాది)గారు, డిటో జిల్లా, డిటో మండలం, డిటో గ్రామం, గవర వీధి కాపురస్తులు అయిన శ్రీ భీమరశెట్టి పైడియ్యనాయుడు, తండ్రి (లేటు) ఆదినారాయణ గారి స్వాధీనఅనుభవనము, సంపూర్ణ హక్కులు కల్గియుండి, వేరే వారికి ఎటువంటి హక్కులు లేనటువంటి ఈక్రింది షెడ్యూలు ఆస్థిపై ఎవరికైనా, ఎటువంటి హక్కులు గాని, అభ్యంతరాలుగాని యున్నయెడల ఈక్రింది అడ్రసుకి ఒక వారంరోజుల కాలవ్యవధిలోపు తెలియపర్చవలెనని, లేనియెడల సదరాస్థిపై ఎవరికి, ఎటువంటి అభ్యంతరాలు గాని, హక్కులు గాని లేవని భావించి తదుపరి నా క్లయింటు సరియగు స్టాంపుపై రిజిస్ట్రేషన్ చేయించుకోవడమగునని తెలియజేయడమైనది.

<u>షెడ్యూలు ఆస్థి వివరణ</u>

జిల్లా : అనకాపల్లి, మండలం : వి.మాడుగుల
గ్రామం : మాడుగుల, వీధి: పెదకొమటిపేట
సర్వేనెం.241/1, విస్తీర్ణం:యం.$0-11^{1/2}$ సెంట్లు గల శ్రీవిజ్ఞాన్ పబ్లిక్ స్కూలు నడపబడి మరియు పాత కోర్టు అని పిలవబడి యున్నటువంటి ఖాళీ స్థలంనకు హద్దులు
తూ: జాగావి శ్రీనివాసరావుగారి నివాస గృహం
ద : పంచాయితీ రోడ్డు
ప : జాగావి దేముళ్లు తా॥నివాస గృహం
ఉ : శ్రీనాధు పార్వతీశంగారి ఇంటి పునాదులు

<u>వై.చిన్నారావు</u>
అడ్వకేట్, వి.మాడుగుల
సెల్: 984966356

డాక్యుమెంట్లు పోయినవి

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది యేమనగా, ఈ దిగువ షెడ్యూల్‌లో వివరించబడిన ఆస్తికి సంబంధించిన రిజిస్ట్రీ క్రయ దస్తావేజు NO: 3926/2000 నకు ఒరిజినల్ సవరణ దస్తావేజు NO : 1914/2016 నా క్లయింట్స్ అయిన 1) శ్రీమతి కాళ్ళ కృష్ణవేణి, భర్త లేటు రామకృష్ణ మరియు ఆమె కుమార్తెలు 2) కాళ్ళ జగదీశ్వరి, 3) కాళ్ళ రామలక్ష్మి అను వారు విశాఖపట్నం రవీంద్రనగర్ నుంచి విశాలాక్షినగర్కు ఆటోలో వెళ్ళు సమయములో పోయినది. వెను వెంటనే వారు తే.01-08-2022 దీన విశాఖపట్నం అరిలోవ జోన్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా పోలీస్ వారు తే. 21-09-2022దీన Not Trace out Certificateను ఇచ్చియున్నారు.

సదరు రిజిస్టర్ డాక్యుమెంట్ దాఖలా ఆస్తిని సెక్యూరిటీగా వుంచి Canara Bank, Main Branch-II, Vizianagaram loan పొందుటలో భాగంగా తే 28-05-2024 దీన Doc No: 1914/2016 పోయినదిగా పేపర్లో ప్రకటన ఇచ్చి యున్నారు. కానీ అనివార్య కారణాల వలన సదరు loan Canara Bank, Main Branch-II, Vizianagaram వారి నుంచి పొందుట జరిగి యుండలేదు. అయితే అదే పేపర్ ప్రకటన సంబందిత దస్తావేజులను డిపాజిట్ చేసి TATA Capital Housing finance నుంచి loan పొంది యున్నారు. అయితే సదరు loan Indian Bank, Vizianagaram వారి ద్వారా టేక్ ఓవర్ గావించుకొనుటకు సదరు బ్యాంకు ను సంప్రదించినారు. కావున సదరు Doc No: 1914/2016 ఎవరికైన దొరికిన యెడల పై నా క్లయింట్స్ కు అందజేయగలరు. అటులనే సదరు పైన తెలిపిన missing/lost Document No: 1914/2016 నాకు సంబంధించి Indian Bank, Vizianagaram వారికి నా క్లయింట్స్ తాకట్టు పెట్టి ఋణమును పొందుటలో ఎవరికైనా ఎటువంటి క్లెయిమ్లు కానీ, అభ్యంతరములు కానీ యున్న యెడల నేటికి ఏడు దినములలోగా Indian బ్యాంక్ వారికి లిఖిత పూర్వకముగా తెలుపవలసినది. లేని యెడల సదరు ఆస్తి నిర్వివాద ఆస్థి అని భావించి సదరు ఆస్థిని TATA Capital Housing finance నుంచి Indian Bank, Vizianagaramకు టేక్ ఓవర్ చేసుకొనుటలో ఎవరికి ఎట్టి అభ్యంతరములు లేవని భావించి 1st Chargeగా లోను ప్రోసెస్ చేయబడును.

తదుపరి ఎటువంటి క్లెయిమ్లు పరిగణలోనికి తీసుకొనబడవు అని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

<u>షెడ్యూల్</u>

విజయనగరం జిల్లా, విజయనగరం జాయింట్ స॥ రి॥ ఆ॥, విజయనగరం మున్సిపాలిటీ, మహారాజుపేట సౌత్ వార్డులో యున్నటువంటిన్నీ మున్సిపల్ వార్డు నెం.27రులో చేరినటువంటిన్నీ, దాసన్నపేట, నాగవంశపు వీధి దగ్గర, నాతవలస రోడ్డుకు ఉత్తర శ్రేణిని యున్నటువంటి, టి.ఎస్. నెం. 1283రులో భాగమైనటువంటిన్నీ, డోర్ నెం. 27-3-6రు లైనులో యున్నటువంటి ఖాళీ నివేశన స్థలమునకు కొలతలు, హద్దుల వివరములు.

విస్తీర్ణం :146.66 చ॥గ॥లు

హద్దులు :- **తూర్పు :**అద్దేపల్లి త్రినాధరాజు గారి ఇంటిగోడ మరియు ఉట్ల శంకర్రావు గారి ఖాళీస్థలం. **దక్షిణం:** రస్తా. **పడమర :** సంగం కృష్ణకుమారి (వురఫ్) రామలక్ష్మి గారి ఖాళీస్థలం. **ఉత్తరం :** గుగ్గిలాపు జ్యోతి గారి ఇంటి ప్రహారి గోడ.

P.V.S. Prasad,
Advocate, Vizianagaram
Cell No.7799955633

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపల్ స్వర్ణ తదితరులు

ముగిసిన వేసవి శిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి గొల్లలపాలెం సి డార్ పాఠశాలలో డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన విద్యార్థులకు గత కొన్ని రోజులుగా ఉచితంగా ఇస్తున్న కరాటే వేసవి శిక్షణా శిబిరం సోమవారంతో ముగిసింది. కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పసుపు, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్, బ్లాక్ బెల్టులు అందజేశారు. డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు రెమో యాదవ్, అధ్యక్షులు వరహాలు, పాఠశాల ప్రిన్సిపల్ స్వర్ణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లాకు కెకె.రాజు పరామర్శ

ప్రజాశక్తి -సీతమ్మధార : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తండ్రి మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతిచెందడంతో సీతమ్మపేటలోని వారి నివాసానికి వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు వెళ్లి పరామర్శించారు. పల్లా సింహాచలం చిత్రపటానికి కెకె.రాజు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర్రావు, కార్పొరేటర్లు అనిల్ కుమార్‌రాజు, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, నాయకులు సేనాపతి అప్పారావు, పేడాడ రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆనందపురం మండల సమావేశం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో మండలంలోని వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ హాజరై సమగ్ర చర్చలకు సహకరించాలని కోరారు.

అలరించిన సినీ గీతాల విభావరి

ప్రజాశక్తి-సీతమ్మధార : గీత్ సంగీత్ సంస్థ ఆధ్వర్యాన పౌర గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన హిందీ సినీ గీతాల విభావరి అలరించింది. సంస్థ వ్యవస్థాపకులు మహమ్మద్ ఖాన్ నిర్వహణలో నగరానికి చెందిన గాయనీగాయకులు హిందీ గీతాలను ఆలపించారు. కార్యక్రమాన్ని క్రెడయ్ చైర్మన్ ధర్మేందర్ వరద, కళా రంగ ప్రముఖులు సన్ మూర్తి, దాడి సత్యనారాయణ, ఫణిస్వామి, వద్రె నాంచారయ్య ప్రారంభించారు. మానసిక ఉల్లాసానికి కళలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. గాయనీ గాయకులు దేవరాజ్, స్టీఫెన్స్, మాధవి, ప్రసాద్, రజని, శైలజ, కల్యాణి, భారతి, పావని, సురేష్ ఖన్నా, ఎమ్ఎస్.మాధవ, ఖాన్ తదితరులు వివిధ గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో అరుణ కాంత్, పత్తి వెంకటప్రసాద్, కోరుకొండ రంగారావు, మస్తాన్ రెడ్డి, చెన్న తిరుమలరావు, సంఘ సేవకుడు జివిఎస్.మణికంఠ, రజని తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జిలతోనే విద్యా వ్యవస్థ

రెగ్యులర్ ఎంఇఒ లేక ఇబ్బందులు

ప్రజాశక్తి- ఆనందపురం : విద్యా వ్యవస్థను పటిష్టంగా మార్చాలని ప్రతి ఒక్కరూ కోరుతున్న కాలంలో ప్రభుత్వ వ్యవస్థ మాత్రం ఇన్‌ఛార్జి అధికారులతోనే నడుస్తూ విద్యాభివృద్ధికి ఆటంకంగా మారుతోంది. ఆనందపురం మండలంలో గతంలో రెగ్యులర్ ఎంఇఒగా బాధ్యతలు నిర్వహించిన పద్మావతి ఉద్యోగ విరమణ చేసిన తరువాత ఇప్పటి వరకు శాశ్వత ఎంఇఒ నియమించలేదు. చినగదిలి ఎంఇఒ రవీంద్రబాబును ఇన్‌ఛార్జిగా నియమించారు. ప్రస్తుతం వైజాగ్‌లోని క్వీన్ మేరీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న జోగేంద్రనాథ్ ఆనందపురం మండల ఎంఇఒ-1గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒకే సమయంలో రెండు చోట్ల విధులు నిర్వహించాల్సి రావడంతో వారు ఎటువైపూ దృష్టి సారించలేకపోతున్నారు.

గత విద్యా సంవత్సరం ఉత్తీర్ణతా శాతం తగ్గుదల, విద్యా ప్రమాణాల్లో వెనుకబాటుగా ఉండటం, గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన 'నాడు-నేడు' పనుల్లో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిపై సమగ్ర సమాచారం ఇవ్వగల శాశ్వత అధికారి లేకపోవడంతో సమస్యలు అలాగే ఉంటున్నాయి. ఈ పరిస్థితుల్లో విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలంటే వెంటనే శాశ్వత ఎంఇఒను నియమించాలని, విద్యావ్యవస్థను పటిష్టం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ డిమాండ్ చేశారు.

క్రీడా స్ఫూర్తి నింపాలి

డిప్యూటీ మేయర్ గోవింద్ రెడ్డి

విద్యార్థులకు మెమొంటోలుఅందజేస్తున్న డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : చదువు విజ్ఞానాన్ని పంచితే, క్రీడలనేవి మానసిక స్థైర్యాన్నిస్తాయని జివిఎంసి డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్ రెడ్డి అన్నారు. గాజువాక సీనియర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన మే 11 నుంచి జూన్ 8వ తేదీ వరకు నాలుగు విభాగాల్లో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు 65వ వార్డు కాకతీయ స్కూల్ ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనికి.ముఖ్య అతిథిగా గోవింద్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. వేసవిలో సమయాన్ని వృథా చేయకుండా పిల్లల్లో క్రీడా స్ఫూర్తిని నింపాలన్న ఆలోచనలతో చేపట్టిన కార్యక్రమం చాలా గొప్పదని కొనియాడారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

నియోజకవర్గ పరిధిలో క్రీడా మైదానాల ఎంపిక పూర్తయిన వెంటనే అభివృద్ధికి కావాల్సిన నిధులు కూడా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. క్రికెట్, అథ్లెటిక్, బాక్సింగ్, వాలీబాల్ ఇలా నాలుగు విభాగాల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయం అన్నారు. అనంతరం చిన్నారులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, సిపిఐ, టిడిపి నేతలు కసిరెడ్డి సత్యనారాయణ, బైపిల్లి గాంధీ, సీనియర్ పాత్రికేయుడు కసిరెడ్డి రమణ, ఆడారి రామకృష్ణ, అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు కసిరెడ్డి నూకరాజు, ఉరుకూటి రాజారావు, నగేష్, సిహెచ్ రమణ, వాసు, ప్రభు, వెంకట రామారావు, 120 మంది చిన్నారులు పాల్గొన్నారు.

మార్కెట్ కాలువ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడ రోజువారీ మార్కెట్ వద్ద కాలువ పొంగి మురుగు నీరు రహదారిపైకి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం నాయకులు సోమవారం పిజిఆర్ఎస్‌లో జోనల్ కమిషనర్ కనక మహా లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు డి.అప్పలరాజు, పి.రాజుకుమార్ మాట్లాడుతూ, ఈ రహదారి నుండి సుమారు 10 కాలనీల ప్రజలు ప్రయాణం చేస్తుంటారని తెలిపారు. మార్కెట్, ఇతర అవసరాల నిమిత్తం అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారని, ఇక్కడ ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాలు, కాలనీల నుంచి నిత్యం రోగులు వస్తుంటారని తెలిపారు. వీరంతా రహదారిపైకి వచ్చే మురుగుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. శిథిలమైన కాలువను తొలగించి తక్షణమే నిర్మాణం చేయాలని కోరారు. ప్రస్తుతం కాలువలో పూడికలనైనా తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఖాతాదారుల నమ్మకంతో సొసైటీ అభివృద్ధి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఖాతాదారులకు నమ్మకంతో సేవలు అందించడంతో సొసైటీ ఎంతో అభివృద్ధి సాధించిందని, ఖాతాదారుల సహకారంతో మరింత ముందుకెళ్తామని ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పిఆర్‌విపిఎస్.రాజు పేర్కొన్నారు. పౌరగ్రంథాలయంలో గురువారం నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఐదు రాష్ట్రాలలో 42 బ్రాంచీల్లో ఖాతాదారుల సహకారంతో రూ.4500 కోట్ల లావాదేవీలతో సేవలను అందిస్తున్నామని చెప్పారు. దేశంలోని టాప్ 10 సొసైటీలలో ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ ముందుందని సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.నరేంద్ర కుమార్ తెలిపారు. ఈ ఏడాది రూ.82 కోట్ల లాభాన్ని అర్జించిందని, షేర్ హోల్డర్లకు గత ఏడాది 18 శాతం డివిడెండ్ చెల్లించడమే కాకుండా సేవింగ్ ఖాతాపై 6.5 శాతం వడ్డీ, డిపాజిట్లపై 10 శాతం అత్యధిక వడ్డీ చెల్లిస్తున్నామని వివరించారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ బొల్లిన ప్రభాకరరావు, బ్రాంచి మేనేజర్ సిహెచ్.రాజశేఖర్, సబ్ మేనేజర్ సిహెచ్.రమ్య, బి.వీరు బాబు, జి.అప్పారావు, ఎన్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై జెడ్‌సికి వినతి

ప్రజాశక్తి- భీమునిపట్నం : పలు సమస్యలపై స్థానిక వినియోగదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సోమవారం జోనల్ కమిషనర్ బమ్మి అయ్యప్పనాయుడుకు వినతి పత్రం అందజేశారు. బీచ్‌లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని, పర్యాటకులకు సదుపాయాలు కల్పించాలని, తీరం కోతకు గురిగాకుండా రక్షణ గోడ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సన్యాసినాయుడు, పి.రాజేంద్రప్రసాద్ వర్మ, ప్రతినిధులు టి.బీమారావు, మైలపల్లి లక్ష్మణరావు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, ఎం.సూర్యశ్రీనివాస్, ఎస్.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయుడు, వర్మ తదితరులు

నేరాలు ఘోరాలు

కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గోపాలపట్నం : తాగిన మైకంలో ఓ వ్యక్తి కాలువలోపడి మృతి చెందిన ఘటన 89వ వార్డు పరిధి యల్లపువానిపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... ఇంటి రాంబాబు (42) బతుకు తెరువు కోసం కాకినాడ నుంచి యల్లపువానిపాలేనికి వలస వచ్చాడు. ఆదివారం రాత్రి మద్యం తాగి మురుగు నీరు పారే కాలువ గట్టుపైన రాంబాబు కూర్చున్నాడు. మైకంలో కాలువలో బోర్లా పడిపోయాడు. తలకి బలమైన గాయం కావడంతో మృతిచెందాడు. సోమవారం తెల్లవారు జామున అటువైపు వెళ్లిన వ్యక్తి గమనించి స్థానికులకు సమాచారం ఇచ్చాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి పరిశీలించి కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

జర్నలిస్టుల క్రికెట్ పోటీల్లో ప్రజాశక్తి టీమ్

జర్నలిస్టుల క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యాన నిర్వహించిన జర్నలిస్ట్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం పోర్టు స్టేడియంలో ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ అధినేత బొడ్డేటి కాశీవిశ్వనాథం హాజరై మాట్లాడుతూ, జర్నలిస్టులు సమాజానికి -ప్రభుత్వానికి మధ్య వారధిలాగా పని చేస్తుంటారని తెలిపారు. క్షణం తీరిక లేకుండా ఉండే జర్నలిస్టులకు ఒత్తిడి తగ్గించేందుకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ బస్సుల ప్రారంభంలో ఫ్రెష్ బస్సు సంస్థ ప్రతినిధులు

ఫ్రెష్ బస్సు సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి -కొమ్మాది : ఫ్రెష్ బస్సు కంపెనీ వైజాగ్ నుంచి అమరావతి వరకు కొత్త ఎలక్ట్రికల్ బస్సు సర్వీసులను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఫ్రెష్ బస్సు వ్యవస్థాపకులు సుధాకర్ చిర్రా మాట్లాడుతూ, ఈ బస్సు సర్వీసులో అత్యాధునిక హంగులు, ప్రయాణికులకు అవసరమైన అన్ని సదుపాయాలు ఉన్నాయని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ దిశగా ఇంధన కాలుష్యం నివారించే లక్ష్యంతోఈ బస్సును ప్రవేశపెట్టినట్లు తెలిపారు. విశాఖపట్నం నుంచి గుంటూరు వరకు వెళ్లే ఈ బస్సు మధ్యలోరాజమండ్రి వద్ద ఆగుతుందని వివరించారు. మరిన్ని సర్వీసులను యాజమాన్యం పెంచాలని ఎంపీ శ్రీభరత్ కోరారు.

పర్యావరణ పరిరక్షణపై పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మ్యాజిక్ బస్ ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు, తల్లిదండ్రులకు సోమవారం పలు పోటీలు నిర్వహించారు. చార్టులపై వివిధ రకాల బొమ్మలు వేశారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.రామ్‌ప్రసాద్, హైస్కూల్ హెచ్‌ఎం రమణ, తెలుగు అధ్యాపకులు రాంబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మ్యాజిక్ బస్ మానిటరింగ్ అధికారి దూడ రమేష్, కె.శారద, టి.రమ్య, దుర్గ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పర్యావరణంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ రామ్‌ప్రసాద్

తొలగించిన 'ఉక్కు' కాంట్రాక్టు కార్మికులను

విధుల్లోకి తీసుకోవాల్సిందే..

హెచ్‌పిసిఎల్ గేటు వద్ద సంఘీభావ నిరసన

◆ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సంఘీభావ కార్యక్రమాలు

◆ పోలీస్ నిర్బంధం ఆపాలి : సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్టు కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఉక్కు పరిరక్షణ వేదిక ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్, గురజాడ విగ్రహం, ఆశీలుమెట్ట మీదుగా తిరిగి జివిఎంసి వరకు ప్రదర్శన జరిగింది. మధ్యలో ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపానగల లలితా జ్యుయలర్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ప్రదర్శన అనంతరం సిఐటియు, ఏఐటియుసి జిల్లా నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎం.మన్మథరావుల అధ్యక్షతన సభ జరిగింది. దీనిలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ కోసం జరిగిన పోరాటాలను తెలియజేశారు. 2021లో ప్రారంభించిన ఈ పోరాటం ఫలితంగా ప్లాంట్‌ను ఒక్క శాతం కూడా ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకోగలిగామన్నారు. గతంలో రాష్ట్రంలోని టిడిపి, జనసేన నాయకులు స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం తాము కట్టుబడి ఉన్నామని, అధికారంలోకి వస్తే ప్లాంట్‌ను కాపాడి తీరుతామని హామీ ఇచ్చిన సంగతిని గుర్తు చేశారు. నేడు స్టీల్‌ప్లాంట్‌లో ఏ విధమైన ముందస్తు నోటీసూ లేకుండా అత్యంత దారుణంగా కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుంచి తొలగించారన్నారు. వారందరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ దీక్షా శిబిరంలో కార్మికులను కూర్చోనివ్వకుండా పోలీసులే మొత్తం శిబిరాన్ని ఆక్రమించి కూర్చోవడం చూస్తుంటే ఆశ్చర్యమేస్తోందన్నారు. పోలీసు నిర్బంధాన్ని ఖండించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు కార్మికుల వల్లే ప్లాంట్‌కు నష్టాలు వచ్చాయని చెప్పడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు, ఎపిఎఫ్‌టియు జిల్లా నాయకులు దేవా, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ పి.మణి, సిఐటియు నాయకులు బి.జగన్, ఎం.సుబ్బారావు, వి.కృష్ణారావు, కెఎం.కుమార మంగళం, ఎస్.జ్యోతీశ్వరరావు, పి.వెంకటరావు, కె.చంద్రశేఖర్, ఏఐటియుసి నాయకులు కె.సత్యనారాయణ, జి.వామనమూర్తి, కాసుబాబుతో పాటు కార్మికులు, ప్రజా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల దౌర్జన్యకాండ

ఉక్కునగరం : ఎన్నికల సమయంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కృషి చేస్తామన్న మాటను మరిచి తన అసలు నైజాన్ని విశాఖలో సోమవారం మరోసారి కూటమి ప్రభుత్వం ప్రదర్శించింది. కూర్మన్నపాలెం కూడలిలోని దీక్షా శిబిరాన్ని స్వాధీనం చేసుకునేందుకు యత్నించింది. ఆ ప్రయత్నాన్ని కార్మికులు తీవ్రంగా ప్రతిఘటించారు. పోలీసుల చర్యను ఖండిస్తూ కార్మికులు నేలపై బైఠాయించి తమ నిరసనను కొనసాగించారు. సోమవారం ఉదయానికే కార్మికులు నిరసన దీక్షలో పాల్గొనేందుకు కూర్మన్నపాలెం కూడలికి చేరుకున్నారు. అప్పటికే దీక్షా శిబిరంలోకి పోలీసులు చొరబడ్డారు. దీక్షా శిబిరంపై వారి చర్యలను కార్మికులు ప్రశ్నించారు. సుమారు 70 మంది పోలీసులు దీక్షా శిబిరంలోని కుర్చీల్లో కూర్చోవడాన్ని కార్మికులంతా ఖండించారు. దీక్షా శిబిరంలోని నేలపైనే కూర్చుని ఆందోళన కొనసాగించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరాం, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైటి.దాస్, యు.రామస్వామి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, జివిఎంసి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, ఉక్కు కార్మిక సంఘాల నాయకులు టివికె.రాజు, శ్రీనివాసరాజు, గంగాధర్, నీరుకొండ రామచంద్రరావు, కనకరాజు, వివి.రమణ, మసేను, సోమేష్ పాల్గొన్నారు.

తగరపువలసలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ములగాడ : అక్రమ తొలగింపులు ఆపాలని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల పోరాటానికి సంఘీభావంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన సోమవారం హెచ్‌పిసిఎల్ లేబర్ గేటు వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తి, ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి బి.నాగభూషణం, ఏఐటియుసి జిల్లా నాయకులు కె.సత్యనారాయణ, వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు ఆర్.అనిల్, 60వ వార్డు కార్పొరేటర్ పివి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన తగరపువలసలో ర్యాలీ నిర్వహించారు. చిట్టివలస సిఐటియు కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ జ్యూట్ కార్మిక వాడ మీదుగా జంక్షన్‌కు చేరింది. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల పోరాటానికి మద్దతు తెలుపుతూ స్థానిక ప్రైవేట్ మార్కెట్ వద్ద రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి, సిఐటియు నాయకులు వంపాన సూర్య నారాయణ, పల్లా పెంటరాజు, చిన్నారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల తొలగింపుపై నిరసన

అనకాపల్లి : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన 5,400 మంది కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్‌లో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు ఏఐటియూసీ జిల్లా కార్యదర్శి అప్పలరాజు మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణలో భాగంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం 5,400 మందిని తొలగించిందని, వీరికి ఎటువంటి నష్టపరిహారం కూడా చెల్లించలేదని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కొనుగోలు చేసే ప్రైవేటు వారిపై అప్పుల భారం తగ్గించటానికే కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్లు ప్యాకేజీని ప్రకటించిందని, అంతే తప్ప ప్లాంట్‌ను ఆదుకోవడానికి కాదని తెలిపారు. 40 ఏళ్లగా నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా దానిని ఉరి తీస్తూ, ఇంకా నిర్మాణం కాని మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు ఇనుప ఖనిజ గనుల కోసం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పివిఎన్వి.పరమేశ్వరరావు, నాయకులు బి.అప్పారావు, కె.అప్పారావు, టి.సురేష్, పి.చలపతి, ఈశ్వరరావు, ఏఐటియుసి నాయకులు వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

డంపింగ్ యార్డును ఎత్తివేయాలి

ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి రామచంద్రనగర్ గ్రామానికి ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డును తక్షణమే ఎత్తివేయాలని సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డును ఎత్తివేయాలని కోరుతూ డంపింగ్ పోరాట కమిటీ ఆధ్వర్యాన 16 గ్రామాల ప్రజలు కలిసి పెద్ద ఎత్తున డంపింగ్ యార్డ్ గేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, 15 సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు డంపింగ్ వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ జివిఎంసి అధికారులు, ప్రభుత్వాలు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ సమస్యను జివిఎంసి మేయర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేంతవరకు ప్రజల పక్షాన నిలబడతామని స్పష్టంచేశారు. జనావాసాల మధ్య డంపింగ్ యార్డు పెట్టడం నిషేధం అయినప్పటికీ, చట్టాలను ఉల్లంఘించి ఈ ప్రాంతంలో డంపింగ్ పెట్టడం దుర్మార్గమని అన్నారు. వెంటనే ఈ డంపింగ్ యార్డును ప్రజా ఆదరణ లేని ప్రాంతానికి తరలించాలని కోరారు. రోజుకి 250 టన్నుల చెత్తను నిల్వ చేస్తున్నారని, దీని దుర్వాసన వల్ల ఊపిరితిత్తులు కేన్సర్ వంటి వ్యాధులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీకి చిత్తశుద్ధి ఉంటే ఒక రోజులోనే ఈ సమస్యను పరిష్కరించవచ్చని, కానీ వారు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ ధర్నా ఆరంభం మాత్రమేనని, తదుపరి వంటా వార్పుతో పాటు, రిలే నిరాహార దీక్షలు డంపింగ్ యార్డ్ దగ్గర టెంట్ వేసి 16 గ్రామాల ప్రజలందరినీ ఐక్యం చేసి పోరాడతామని స్పష్టంచేశారు. టిడిపి కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ, అనకాపల్లి, గాజువాక, మల్కాపురం ప్రాంతాల చెత్తను కూడా ఈ డంపింగ్ యార్డులో వేస్తున్నారని తెలిపారు. ప్రజల ఆందోళనకు తన పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు. వైసిపి నాయకులు మంత్రి శంకర్ నారాయణ, సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, జనసేన 73 వార్డు అధ్యక్షులు రౌతు గోవింద్ మాట్లాడుతూ, ఈ డంపింగ్ యార్డు తరలించే వరకు డంపింగ్ యార్డ్ పోరాట కమిటీ తీసుకున్న అన్ని కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్వానివాస్ నాయకులు త్రినాథస్వామి, రామచంద్రనగర్ గ్రామ అధ్యక్షులు వి.నారాయణరావు, డి.రమణ, ఎస్.రమేష్, గాంధీనగర్ అధ్యక్షులు రామినాయుడు, రిక్షా కాలనీ అధ్యక్షులు చిన్నారావు, ఎస్.నాయుడు, స్వతంత్రనగర్ వాసులు లక్ష్మీ, శ్రీదేవి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఆర్‌బిఐ ఇడి

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం అప్పన్న స్వామిని సోమవారం ఆర్‌బిఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధా శ్యామ్ రాథో సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వాహణాధికారి వేంద్ర త్రినాథరావు, ప్రధాన అర్చకులు సీతారామాచార్యులు నాదస్వర వేదమంత్రాలతో స్వాగతం పలికారు. ముందుగా వారు కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. స్వామి దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి శేష వస్త్రముతో సత్కరించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు స్వామివారి ప్రసాదాలు పటము బహుకరించారు.

18న విశాఖకు వైఎస్.షర్మిల

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎపి పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిలా రెడ్డి ఈ నెల 18వ తేదీన విశాఖ రానున్నారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్డాల వెంకట వర్మ రాజు తెలిపారు. సోమవారం సాయంత్రం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు షర్మిలా రెడ్డి అన్ని జిల్లాలలో పర్యటిస్తున్నారని, అందులో భాగంగా విశాఖ వస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో పిసిసి జనరల్ సెక్రటరీ గాదం మహేష్, సూర్యానారాయణ, దండి ప్రియాంక, సవరవెల్లి రామకష్ట, గౌతమ్ కుమార్ పాల్గొన్నారు.

ఇఎపిసెట్‌లో 'శ్రీవిశ్వ' విజయభేరి

ప్రజాశక్తి -ఆనందపురం : ఇఎపిసెట్‌లో విశాఖపట్నంలోని శ్రీవిశ్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులను సాధించారని డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. ఈ ఏడాది 1000 లోపు ర్యాంకులతో విద్యార్థులు కళాశాల కీర్తిని పెంపొందించారని పేర్కొన్నారు. జి. గురు చరణ్ - 147, సిహెచ్.మోడా సాయి సాకేత్ - 160, ఎస్.నాగ లలిత శ్రావ్య - 181, బి.వర్షిణి-184, బి. శ్రావణి - 259, జి.ఉష శ్రీ -396, షేక్ నిజాముద్దీన్ 343, కెవి.కుతుబ నిహార్- 383, సిహెచ్. వేంకట హేమ వర్ధన్ -472, యు. జయంత్ కుమార్ -519, ఎం.రాజేష్- 528, డి.అజయ్ 553 ర్యాంకులను సాధించారని వివరించారు. మొత్తం 1000 ర్యాంకులోపు 28 మంది, 5000 ర్యాంకులోపు 162 మంది, 10000 ర్యాంకులోపు 320 మంది సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో శ్రీవిశ్వ విద్యాసంస్థల ఛైర్మన్ కె.ధర్మరాజు మాట్లాడుతూ, ఈ ఘనత సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపకులు, సిబ్బందిని అభినందించారు. శ్రీవిశ్వ విద్యాసంస్థల డైరెక్టర్ పి.సూర్యనారాయణ మాట్లాడుతూ, 'ఈ విజయాలు విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల నిబద్ధత, సంస్థ దిశానిర్దేశానికి ప్రతిఫలంగా నిలిచాయని పేర్కొన్నారు.

ప్రజాశక్తి 5
మంగళవారం 10 జూన్ 2025

భావితరాలకు షైనింగ్ స్టార్స్ స్ఫూర్తి

అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రులు బాలవీరాంజనేయస్వామి, కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ

పేదవిద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా షైనింగ్ స్టార్స్ అవార్డులను ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. సోమవారం ఆంధ్రా యూనివర్శిటీ అంబేద్కర్ అసెంబ్లీ హాలులో ఇంటర్, టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంపీ శ్రీభరత్, విప్ గణబాబు, ఏపీ గ్రోవర్స్ అండ్ ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌లతో కలిసి షైనింగ్‌స్టార్ అవార్డులను అందజేశారు. ముందుగా విద్యార్థులు ఏర్పాటు చేసిన డ్రీమ్, గ్రాటిట్యూడ్ వాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వారం రోజుల్లో తల్లికి వందనం నిధులు జమ చేస్తామని, పేద విద్యార్థుల సౌకర్యార్థం ఈ ఏడాది నుంచి ఎస్సీ గురుకులాల్లో ఇంటర్ విద్యార్థులకు ఐఐటీ, నీట్ కోచింగ్ తరగతులు అందజేస్తామనానరు. ఇప్పటికే మూడు కేంద్రాల్లో ప్రక్రియ నడుస్తోందని, మరొక ఏడు కేంద్రాల్లో విస్తరిస్తామన్నారు. మండలానికి ఆరుగురి చొప్పున జిల్లాలో 83 మంది టెన్త్, 39మంది ఇంటర్ మొత్తంగా 121 మందికి షైనింగ్‌స్టార్ అవార్డులు అందజేశామన్నారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, విశాఖ ఆర్డీవో పి. శ్రీలేఖ, విద్యాశాఖ ఉన్నతాధికారులు శ్రీనివాసులు రెడ్డి, మధుసూదన రావు, డిఇఒ ప్రేమ్ కుమార్, ఎపిసి చంద్రశేఖర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థిని రూప తనుజాకు...

ములగాడ : మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థిని రూప తనూజ రూప ప్రతిష్టాత్మక షైనింగ్ స్టార్ అవార్డును గెలుచుకుంది. ఇంటర్మీడియట్ ఒకేషనల్ సిఎస్ఇ గ్రూపులో 976/1000 మార్కులు సాధించి, ఎయు అసెంబ్లీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయులు, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పి.గణబాబు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ నుంచి అవార్డు స్వీకరించింది. అవార్డు గ్రహీతను సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ కాస్లిన్ , డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, అధ్యాపకులు, విద్యార్థినులు అభినందించారు.

షైనింగ్‌స్టార్ మానసకు అభినందన

భీమునిపట్నం : టెన్త్ పరీక్షా ఫలితాల్లో 596 మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో ఐదో స్థానంలో నిలిచిన స్థానిక సన్ స్కూల్ విద్యార్థిని పీతల మానస ఎయు అంబేద్కర్ ఫంక్షన్ హాల్ వేదికగా జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్, ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే గణబాబు నుంచి అవార్డు స్వీకరించింది.

ఇద్దరు గాయత్రి విద్యార్థులకు...

కశింకోట : పది పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మండలంలో తాళ్లపాలెం శ్రీగాయత్రి హైస్కూల్ విద్యార్థులు కొల్లి మోహన్, సుగ్గ శ్రీవెంకట్ షైనింగ్ స్టార్స్ 2025 అవార్డు కు ఎంపికై, సోమవారం జిల్లా కేంద్రంలోని పెంటకోట కన్వెన్షన్స్ హాల్లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నుంచి అవార్డు స్వీకరించారు. అవార్డు గ్రహీతలను గాయత్రి పాఠశాల ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఎమ్మెల్యే కొణతాల నుంచి అవార్డు అందుకుంటున్న దృశ్యం

పలువురికి ప్రశంసలు

అనకాపల్లి : ఇంటర్, టెన్త్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సోమవారం పట్టణంలోని పెంటకోట కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరపున షైనింగ్ స్టార్స్ అవార్డులను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంధ్ర అందజేశారు. జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించి, ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. విద్యాశాఖ అధికారులను ప్రశంసించారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సీఎం .రమేష్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్‌కుమార్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, అనకాపల్లి ఆర్‌డిఒ షేక్ అయిషా, జిల్లా ఇంటర్ విద్యాధికారి బి సుజాత, డిఇఒ జి అప్పారావు నాయుడు, సమగ్ర శిక్ష జిల్లా ఎపిసి ఆర్ జయప్రకాష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు అందజేస్తున్న మంత్రి రవీంద్ర, కలెక్టర్, ఎమ్మెల్యేలు

దేవరాపల్లి మండలంలో ఆరుగురికి...

దేవరపల్లి : దేవరాపల్లి మండలానికి చెందిన ఆరుగురు టెన్త్ విద్యార్థులు గుంపాన ఉదయ్ కుమార్(590), మురకుర్తి దేవానంద్(578), బి.హర్షిత(567), చెరుకూరి మౌనిష(560), శ్రీనాథ జయకృష్ణ(549), పెంట జయశ్యామ్ కుమార్(521) షైనింగ్ స్టార్స్ అవార్డులు స్వీకరించారు. అనకాపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ నుంచి మెడల్, ప్రశంసా పత్రం, రూ.20వేలు చెక్కును అందుకున్నారు.

అవార్డులు అందుకుంటున్న నాతవరం విద్యార్థులు

బుచ్చయ్యపేట మండలంలో ఎనిమిది మందికి...

బుచ్చయ్య పేట : మండలానికి చెందిన ఎనమిది మంది టెన్త్ విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వ షైనింగ్ స్టార్ అవార్డులు స్వీకరించారు. అనకాపల్లిలో సోమవారం జిల్లా ఇన్చార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ విజయ్‌కృష్ణన్, డిఇఒ అప్పారావు నాయుడు నుంచి విద్యార్థులు శంకర్, మనోహర్, సాయి కుసుమ, ఈశ్వర ప్రసాద్, శ్రీలక్ష్మి, విజయ జ్యోతి, రెడ్డి ప్రవీన్, ఉషారాణి అవార్డు కింద రూ.20వేల నగదు, గోల్డ్ మెడల్ ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థికి...

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి బాధంకి హేమంత్‌కుమార్ ఇంటర్‌లో హెచ్ఇసి గ్రూపులో 902మార్కులు సాధించి షైనింగ్ స్టార్ అవార్డు స్వీకరించారని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పివిఎన్ మూర్తి తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంధ్ర నుంచి అవార్డు కింద రూ.20వేల చెక్కు, ప్రశంసాపత్రం, గోల్డ్‌మెడల్ స్వీకరించిన హేమంత్‌కుమార్‌ను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందిచారు



అవార్డులు అందుకుంటున్న దేవరాపల్లి విద్యార్థులు

ఇద్దరు విద్యార్థులకు షైనింగ్‌స్టార్ అవార్డులు

నాతవరం : పదో తరగతిలో మండల స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన షైనింగ్ స్టార్ ప్రతిభా అవార్డ్సను స్వీకరించిన పేరిట ఎన్‌డి. సైట్ తాండవ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కూనిశెట్టి. దివ్య, శెట్టి పుష్పలను హెచ్‌ఎం ఒ.సత్యనారాయణ, ఎస్‌ఎంసి చైర్మన్ రాజుబాబు, ఉపాధ్యాయులు అభినందించారు. అనకాపల్లి పెంటకోట కన్వెన్షన్ హల్‌లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంధ్ర, ఎమ్మెల్యేలు సుందరపు విజయకుమార్, కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, విద్యా శాఖ అధికారులు నుంచి అవార్డు కింద రూ.20వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం స్వీకరించారు.

అణిముత్యాలు వెతికి తీయడమే 'కారుణ్య' లక్ష్యం

నర్సీపట్నం టౌన్ : నిరుపేదల్లో ఆణిముత్యాలను వెలికితీసి ఉన్నతవిద్యావంతులుగా తీర్చిదిద్దడమే కారుణ్య విద్యాసంస్థల లక్ష్యమని కారుణ్య పాఠశాల, కాలేజీ లక్ష్యమని విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కోనేటి రాజబాబు అన్నారు. స్థానిక కొత్త వీధిలో పాతికేళ్లుగా ఎందరో విద్యావంతులను తీర్చిదిద్దిన కారుణ్య కాలేజీ ఇంటర్ విద్యార్థిని కిరణ్మయి షైనింగ్‌స్టార్ అవార్డును స్వీకరించడంపై కాలేజీ యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఫౌండర్ రాజబాబు మాట్లాడుతూ నర్సీపట్నంలో ఎదురులేని విద్యా వ్యవస్థగా ఎదగాలనే ఉద్దేశ్యంతో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన, జెఇఇ మెయిన్స్, నీట్‌లో ప్రవేశార్హతలే లక్ష్యంగా డిజిటల్ సిస్టం కారుణ్య 2.0 సిస్టం ప్రారంభించామన్నారు. ఆన్‌లైన్ క్లాసులు, విద్యా విధానంలో సాంకేతికతకు పెద్దపీట వేస్తూ అందరికీ అందుబాటులో ఉండే ఫీజులతో విద్యాబోధన చేస్తున్నామన్నారు. ఇంటర్ జాయిన్ అయిన నాటి నుండి మెడిసిన్ సీటు సాధించేవరకు కారుణ్య విద్యాసంస్థ అండగా నిలుస్తుందన్నారు.



కిరణ్మయిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

టాగూర్‌లో విషవాయువు లీకై ఒకరికి అస్వస్థత

మాట్లాడుతున్న గనిశెట్టి

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ ఫార్మాసిటీలోని టాగూర్ లేబొరేటరీ ఫార్మా కంపెనీలో ఆదివారం రాత్రి విష వాయువులు లీకై అది పీల్చడం వలన సింహాచలం అనే కాంటాక్ట్ కార్మికుడు అస్వస్థతకు గురయ్యారు. సింహాచలం క్లీనింగ్ పనుల్లో భాగంగా ఎండిసి సాల్వెంట్తో క్లీనింగ్ చేస్తున్న సందర్భంలో వాయువు విడుదలై అస్వస్థతకు గురైనట్లు తోటి కార్మికులు తెలిపారు. గతంలో ఇదే పరిశ్రమలో విషవాయువు లీకై 39 మంది అస్వస్థతకు గురయ్యారు. వరుస ప్రమాదాలు జరుగుతుండటంతో కార్మికులు భయాందోళన చెందుతున్నారు.

సమగ్ర విచారణ చేయాలి : సిఐటియు

ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సింహాచలం కోలుకునే వరకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పరిశ్రమ గేటు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయనకి వైద్య కాలంలో పూర్తిస్థాయి వేతనం చెల్లించాలన్నారు. గతంలో ఈ పరిశ్రమంలో జరిగిన ప్రమాదంతో 39 మంది అస్వస్థతకు గురైన విషయాన్ని గుర్తు చేశారు. భద్రతా ప్రమాణాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, కార్మికులకు భద్రతా పరికరాలు ఇవ్వాలని, సక్రమమైన మాస్కులు అందించాలని డిమాండ్ చేశారు.

పిజిఆర్‌ఎస్‌కు 240 అర్జీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్‌ఎస్) కార్యక్రమానికి ప్రజలు వ్యక్తిగత, సామాజిక అంశాలపై 240 అర్జీలు అందజేశారు. జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ఎస్‌డిసిలు సుబ్బలక్ష్మి, కె.మనోరమ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీల్లో అత్యధికంగా రెవిన్యూశాఖకు సంబంధించి 122, పంచాయతీ రాజ్ శాఖకు 32, సర్వే శాఖకు 18, పోలీసు శాఖకు 17 ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 25 ఫిర్యాదులు స్వీకరించబడ్డాయి. ఆస్తి వివాదాలు, కుటుంబ కలహాలు, మోసపూరిత చర్యలు వంటి సమస్యలపై అర్జీలు అందజేశారు. అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు ప్రజల నుంచి ప్రత్యక్షంగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ డి.వెంకన్న, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం : కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ప్రజలు ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యలయం వద్ద పెర్మనెంట్ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ స్టోర్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు స్టాల్, క్యాంటీన్లను ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రకతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలు, తయారు చేసిన ఉత్పత్తులు వాడకం ఎంతో ఆరోగ్యకరమని తెలిపారు. ప్రకతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, వారు పండించిన పంటకు మార్కెటింగు సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగులను, లబ్ధిదారులను సంప్రదించి వారికి కావలసిన సరుకులు వివరాలు ముందుగా తెలుసుకొని సరఫరా చేయడం ద్వారా అమ్మకాలు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సిహెచ్ లచ్చన్న, డిఆర్‌డిఎ ప్రాజెక్టు అధికారి కె.శచీదేవి, ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్షతగాత్రునికి ఎమ్మెల్యే సోదరుడు పరామర్శ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని నారపాడు పంచాయితీ శివారు బలిజపాలెం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త మామిడి వెంకట్ ఇటీవల కాలికి గాయం కాగా, విషయం తెలుసుకున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సోదరులు పంచకర్ల వెంకటేశ్వరరావు సోమవారం బలిజపాలెం గ్రామానికి వెళ్లి వెంకట్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడి శంకరరావు, కర్రి కనకరాజు, పడాల వెంకటరమణ, గొర్లి నూకరాజు, బోకం స్వామినాయుడు, కె.నర్సింగరావు పాల్గొన్నారు.

మొక్కలతో ఎన్‌సిసి కేడెట్లు

ఎన్‌సిసి యువశక్తి క్యాంపులో వన మహోత్సవం

ప్రజాశక్తి-సబ్బవరం : ఎన్‌సిసి యువశక్తి 10 రోజుల క్యాంపులో భాగంగా స్థానిక దామోదరం జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఆవరణలో ఎన్‌సిసి విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ నేతృత్వంలో క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్ణిమ్ ప్రభాత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి క్యాడెట్ తమ పుట్టిన రోజున ఒక మొక్క నాటి పెంచాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా 468 క్యాడెట్స్ కోసం 468 మొక్కలను గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం అందజేశారు. అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి సుబేధార్ మేజర్ పైలా శ్రీనివాసరావు, సుబేదార్ సుజన్ సింగ్, ఎన్‌సిసి అధికారులు, 19 విద్యా సంస్థల నుండి 468 ఎన్‌సిసి క్యాడెట్స్ పాల్గొన్నారు.

యోగాంధ్ర పేరుతో ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి-దేవరాపల్లి : యోగాంధ్ర పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తుందని, ప్రజల సమస్యల పరిష్కారం పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పేదలకు అవసరమైన వాటిపై ప్రచారం చేయకుండా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మెప్పు కోసం రాష్ట్ర ప్రభుత్వం మొత్తం యంత్రాంగాన్ని యోగాంధ్ర పనిలోకి దించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం యోగా ఒక్కటే సర్వరోగ నివారిణి అన్నట్లుగా నమ్మబలుకుతుంటే, దానికి వత్తాసు పలుకుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాంధ్ర పేరుతో మొత్తం పనులను విడిచిపెట్టడం దారుణమన్నారు. ఇందులో భాగంగా టెక్నికల్ సమస్యలు ఉన్నాయని నమ్మబలికి ఈ నెల 7 నుండి 10వ తేదీ వరకు ఎటువంటి ధ్రువపత్రాలు మంజూరు చేయడం లేదని పేర్కొన్నారు. శ్రామికులు ప్రత్యేకంగా యోగా చేయనవసరం లేదని, వారికి కావలసింది యోగా కాదని, కనీసం వేతనం అమలు చేస్తేనే వారి ఆరోగ్యాలు బాగుంటాయని తెలిపారు. 8 గంటల పనికి బదులు 12 గంటలు పని చేయిస్తే కార్మికుల ఆరోగ్యం బాగుంటుందా? అని ప్రశ్నించారు? ప్రజలు ప్రతి విషయాన్ని గమనిస్తున్నారని, ఇటువంటి మోసపూరిత కార్యక్రమాలు చేస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కొత్తపెంట, వేచలం, ఎన్.జి.నగరం పంచాయతీల్లో సోమవారం ఇన్‌ఛార్జి డిప్యూటీ ఎంపీడీఓ అనంత ఉమాదేవి ఆకస్మికంగా పర్యటించారు. ఆయా పంచాయతీలలో ఏర్పాటు చేసిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. షెడ్ నిర్వహణ, తడి చెత్తను శుద్ధి చేసి తయారు చేసే సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో సమావేశమై గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై చర్చించారు. గ్రామాల్లో యోగాంధ్ర అమలుపై సమీక్ష నిర్వహించారు.

నారాయణరావు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అనకాపల్లి సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్ ఐ లవ్ అనకాపల్లి పేజీ క్రియేటర్ యెన్నేటి నారాయణరావు కుటుంబాన్ని యూట్యూబర్ హర్ష సాయి సోమవారం పరామర్శించారు. ఇంత చిన్న వయసులోనే రోడ్డు ప్రమాదంలో మరణించడం దురదృష్టకరమని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నారాయణరావు కుటుంబానికి తక్షణ సాయంగా లక్షా 50వేలు రూపాయలు ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులో నారాయణరావు కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అన్ని జిల్లాల్లో గల నారాయణరావు సోషల్ మీడియా ఫాలోవర్లు, అభిమానులు, నిధులు సమీకరించి మరో రెండు లక్షల రూపాయలు అతని కుటుంబానికి అందించనున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలను పునరుద్ధరించాలి

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో నిరసనలు

విశాఖపట్నం కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

దేశవ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాలను కేంద్రం రద్దు చేయడం తగదని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ అన్నారు. ఆయా రెండు చట్టాలు రద్దును నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట వర్కింగ్ జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలతో శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించిన చట్టం 1955లో కేంద్రం అమల్లోకి తేవడం జరిగిందన్నారు. అలాగే వేతనాలు చెల్లింపునకు సంబంధించిన చట్టం 1958 నుంచి అమలు చేయడం జరిగిందన్నారు. అటువంటి చట్టాలను 70 ఏళ్ల తర్వాత రద్దు చేయడం వల్ల జర్నలిస్టులకు తీవ్రంగా నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. కాబట్టి కేంద్రం రద్దు చేసిన ఈ రెండు చట్టాలను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కె.మదన్.చిన్న మధ్య తరహాపత్రికల సంఘం అధ్యక్షుడు జగన్మోహన్, జర్నలిస్టు నేతలు శ్రీనివాసరావు, కృష్ణమూర్తినాయుడు, శ్రీనివాస్‌నాయుడు, కామన్న, కె.విశర్మ, చక్రి,నాయుడు,సత్య నారాయణ, శ్రీలత, మాధవి తదితరులు పాల్గొన్నారు..

అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన జర్నలిస్టుల చట్టాలను పునరుద్ధరించాలని కోరుతూ ఎపి వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) అనకాపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. దీనికి ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బి.వెంకటేష్ మాట్లాడుతూ జర్నలిస్టులకు వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఒక పక్క పోరాటం చేస్తుంటే మరోపక్క కేంద్ర ప్రభుత్వం ఏకంగా ఉన్న చట్టాలను రద్దు చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నేటికీ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. అక్రిడిటేషన్ల విషయంలో తీవ్ర జాప్యం, ఇళ్ల స్థలాల విషయంలో నాన్చుడు ధోరణి అవలంబిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై నల్లబ్యాడ్జీలు ధరించి అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసి నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు శశి, నాగ, యూనియన్ నాయకులు అజయ్, శేఖర్, గణేష్, గంటా శీను, సురేష్, రామకృష్ణ, నాగు, కోన లక్ష్మణ, నాయుడు, షణ్ముఖ, నానాజీ, హరికృష్ణ, శ్రీను, అప్పారావు, గోపాల్ పాల్గొన్నారు.

అనకాపల్లిలో ప్రదర్శన చేస్తున్న పాత్రికేయులు

జిల్లా విజన్ యాక్షన్ యూనిట్ ప్రారంభం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ప్రతి శాసనసభ నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసే విజన్ యాక్షన్ యూనిట్లను సోమవారం రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్‌గా ప్రారంభించగా, జిల్లా కలెక్టరు కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ సిఎం.రమేష్, జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, గవర కార్పొరేషను ఛైర్మన్ మల్ల సురేంద్ర, ఏపి స్టేట్ హౌసింగు కార్పొరేషను ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ, జిల్లా ప్రణాళిక అధికారి జి.రామారావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

చోడవరం : స్వర్ణాంధ్ర 2047 విజన్ నియోజకవర్గ యాక్షన్ ప్లాన్ కార్యాలయాన్ని సోమవారం స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పాల్గొన్న వీడియో కాన్ఫిడెన్స్‌లో నియోజకవర్గ వివరాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో అభివృద్ధి సంక్షేమం పేదరిక నిర్మూలన వంటి కార్యక్రమాలను చేపట్టడానికి వీలు కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, నియోజకవర్గ 4 మండలాలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరస్తులకు కొమ్ము కాస్తున్న జగన్

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నేరస్తులకు కొమ్ము కాస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీష్ విమర్శించారు. చట్టం నుండి తప్పించుకోవడానికి సహకరిస్తున్నారని పేర్కొన్నారు. నేరాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకున్న పోలీసులపై బట్టలు ఊడదీస్తాం, సప్త సముద్రాలు దాటి ఉన్నవారు అందర్నీ తీసుకువస్తాం అంటూ బెదిరించడం సరికాదన్నారు. ప్రజల గుణపాఠం చెప్పినా జగన్‌లో మార్పు రాలేదని ఎద్దేవా చేశారు.

పలు సమస్యలపై ఎంపిడిఒకు సిఐటియు వినతి

ప్రజాశక్తి- రాంబిల్లి : మండలంలోని పలు సమస్యలపై ఎంపీడీవోకు సిఐటియు నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడు నాయుడు మాట్లాడుతూ మండల కేంద్రానికి అతి సమీపంలో వున్న కొండవారిపాలెం గ్రామ ప్రజలకు తాగునీరు లేక అనేక అవస్థలు పడుతున్నారని, తాగునీరుతో పాటు, ఇంటి వాడకానికి కూడా నీళ్లు కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కొండవారిపాలెం గ్రామ ప్రజలకు తాగునీరు అందించాలని కోరారు. పంచదార గ్రామం నుండి అప్పారాయుడుపాలెం మీదుగా ఎస్ఇజెడ్ కాలనీ జంక్షన్ వరకు రోడ్డు పెద్ద గుంతలు పడడంతో ఆ మార్గంలో కంపెనీలకు వెళ్లే వేలాది మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని, కొత్త రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చందక రామకృష్ణ, ధోని కాసియా, చోడుపల్లి గంగరాజు, కె.లక్ష్మి, పైడమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేతలు

ఉపాధి హామీ వేతన బకాయిలు విడుదల చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన నిరసనలు

పరవాడ మండలం మడకపాలెంలో నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ఉపాధి హామీ కార్మికులకు 9 వారాలుగా బకాయి ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని మడకపాలెంలో పని ప్రదేశంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 9వారాల నుండి కూలి డబ్బులు చెల్లించకపోతే వారు ఏమి తిని బతకాలని ప్రశ్నించారు. ఉపాధి హామీ పని ప్రదేశంలో మంచినీరు, మజ్జిగ, టెంట్ వంటి సౌకర్యాలు కల్పించాలని, పనిముట్లు అలవెన్స్, వేసవి వేతనం కలిపి 40శాతం అదనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను ఉపసంహరించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం లైవ్ ఆడిట్ పేరుతో ఉపాధి హామీ కూలీలను వేధింపులకు గురి చేయడం దారుణమన్నారు.

రాంబిల్లి : మండలంలోని దిమిలి గ్రామంలో ఉపాధి హామీ కింద కాలువ పనులు చేస్తున్న కూలీలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేముడు నాయుడు కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడు నెలలుగా తమకు కూలి డబ్బులు చెల్లించడం లేదని, 8 నుండి 15 వారాలు బకాయిలు ఉన్నాయని కూలీలు తెలిపారు. ప్రభుత్వం రోజు కూలి రూ.307 ప్రకటించినా తమకు ఇవ్వడం లేదన్నారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 రూపాయలు చెల్లించాలని, బడ్జెట్లో తగినన్ని నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఉపాధి హామీ కూలీలకు బకాయిలు వెంటనే ఇవ్వాలని సిపిఎం మండల నాయకులు ఎర్ర దేవుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గొండుపాలెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా సుమారు రూ.12 కోట్లు వేతన బకాయిలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మద్దాల జగ్గ అప్పారావు, ఆడారి సాయికుమార్, బండారు సోంపాత్రుడు, కాళ్ల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించకుండా చెట్లు తొలగింపు

-సాగుదారులతో కలిసి అడ్డుకున్న సిపిఎం నేత అప్పలరాజు

- పోలీసులతో వాగ్వాదం

ఫోటో: 1. అడ్డుకుంటున్న సాగుదారులు, అప్పలరాజు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలో రాజయ్యపేటలో వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు సేకరించిన డి పట్టా, సాగు భూముల్లో జీడి, కొబ్బరి చెట్లను ఏపిఐఐసి, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం సిఐ కుమారస్వామి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నడుమ యంత్రాలతో చెట్లు తొలగింపు పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మత్స్యకార నాయకుడు పిక్కి శ్రీనివాసరావు సాగుదారులతో కలిసి చెట్ల తొలగింపును అడ్డుకున్నారు. ఈ సమయంలో నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం డి ఫారం భూముల్లో గల చెట్లకు, సాగు భూములకు, ఆ భూముల్లో ఉన్న తోటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అనేకసార్లు చెట్లకు పరిహారం చెల్లించాలని అధికారులను కోరడం జరిగిందని, హామీ ఇచ్చి, నేటి వరకు పరిహారం చెల్లించలేదన్నారు. పరిహారం చెల్లించకుండా తోటలను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. పోలీసుల బందోబస్తు నడుమ చట్టాలను ఉల్లంఘించి దౌర్జన్యంగా తోటలను నేలమట్టం చేయడం చట్ట ఉల్లంఘనే అవుతుందన్నారు. సమస్యను పరిష్కారం చేయకుండా తోటలను తొలగిస్తే సాగుదారులతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాగుదారులు వాసుపిల్లి శివ, చోడిపల్లి రాజు, చోడిపల్లి వసంతమ్మ, అధికారులు పాల్గొన్నారు.

పనులు అడ్డుకుంటున్న సిపిఎం నేతలు, మహిళలు

మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారి

మేలైన పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- కోటవురట్ల:సమగ్ర పోషణ యాజమాన్య పద్ధతులు అనుసరించి మేలైన దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయ శాఖ అధికారిని సరోజినీ అన్నారు, సోమవారం చౌడవాడ, కోటవురట్ల గ్రామలలో వికసిత కృషి సంకల్ప కార్యక్రమంలో భాగంగా రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శాస్త్రవేత్త ప్రసాదరావు మాట్లాడుతూ, వరిలో విత్తన శుద్ధి చేసుకోవడంతో నారు మడి ఆరోగ్యంగా పెరుగుతుందని, అదేవిధంగా భూసారాన్ని బట్టి మేలైన వరి విత్తనాలు ఎంపిక చేసుకోవాలన్నారు.

వ్యవసాయ అధికారిని మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అమలు అవుతున్న పలు పథకాలపై రైతులకు వివరించారు, నారు మడిలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. రైతులు అధిక దిగుబడి పొందే విత్తనాలను ఎంపిక చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు సూర్యారావు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతతో అవస్థలు

ప్రజాశక్తి-కోటవురట్ల:అసలే ఉక్కపోత తో అల్లాడుతున్న మండల వాసులకు విద్యుత్ శాఖ అధికారుల అనధికారిక విద్యుత్ కోతతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో మండల పరిషత్ పరిసర ప్రాంతం లో సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ కోత విధించారని, పలుమార్లు విద్యుత్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు.ప్రతినిత్యం ఇదే పరిస్థితి ఎదురవుతుందని, నాణ్యమైన విద్యుత్తును అందజేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడుతున్నారు. విద్యుత్తు బిల్లులు షాక్ కొడుతున్నాయని, అయినా పట్టించుకోలేదని తెలిపారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: రైతులకు పెట్టుబడి సాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రెవెన్యూ డివిజన్ అధికారికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రైతు సంఘం జాతీయ సమితి సభ్యులు గంగాభవాని, రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు గురుబాబు మాట్లాడుతూ, కౌలు రైతులకు, రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించాలని కోరారు. ప్రతి ఏడాది పెరుగుతున్న సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకొని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి 5 లక్షల రూపాయలు సాయం అందించాలన్నారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, పంటకాలువల మరమ్మత్తులకు ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా కోశాధికారి కామిరెడ్డి లక్ష్మి, నర్సీపట్నం మండలం అధ్యక్షులు మాకిరెడ్డి రాజుబాబు పాల్గొన్నారు.

12న అప్పికొండమ్మ తల్లి జాతర

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో ఈ నెల 12న అప్పికొండమ్మ తల్లి జాతర నిర్వహణకు ఆలయ కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి రంగులు వేసి సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ పనులు చేపడుతున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పప్పుశెట్టిపాలెం గ్రామంలో గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్యామ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ, ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు

నర్సీపట్నంలో ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్, మహిళలు,

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: అమరావతి రాజధానిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణరాజు లపై స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి కౌన్సిలర్ పద్మావతి ఆధ్వర్యంలో స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. నాతవరం మండలం ఎర్రవరం గ్రామ సర్పంచ్ సత్యవతి, మాకవరపాలెం సర్పంచ్ శిరీషలతో కలిసి పట్టణ పోలీస్ స్టేషన్ లో ఇన్‌చార్జ్ సిఐ రేవతమ్మ, ఎస్సై రమేష్ లకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యవతి మాట్లాడుతూ,నుచిత వ్యాఖ్యలు చేసిన వారిని అరెస్ట్ చెయ్యాలన్నారు. జనసేన పార్టీ కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ, అమరావతి ప్రాంతానికి బ్రాండ్ ఇమేజ్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తాండవ ఛైర్మన్ కరక సత్యనారాయణ, జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సాక్షి లైవ్ డిబేట్లో రాజధాని అమరావతి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కష్ణంరాజు, చర్చను కొనసాగించిన కొమ్మినేని శ్రీనివాసరావు, ప్రసారం చేసిన సాక్షి ఛానెల్‌పై కఠినచర్యలు తీసుకోవాలని సోమవారం టిడిపి విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, జివిఎంసి 33వ వార్డు క్లస్టర్ ఇంచార్జ్ తిరుమలదేవి, టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గౌతమబుద్ధుడి ఆనవాళ్లు ఉన్న నేల అమరావతి. అలాంటి ప్రాంతాన్ని పలకడానికి ఇబ్బంది పడే పదజాలంతో చేసిన వ్యాఖ్యలు ఆవేదనకు గురిచేశాయన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్య, పొట్నూరు మీనాక్షి, సింగంపల్లి మాధవి, కనకదుర్గ పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలలపై ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు

ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్ పాఠశాలలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీఓ వీవీ రమణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ మాట్లాడుతూ, నర్సీపట్నంలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను అనుసరించకుండా పాఠశాలలను నడపడం జరుగుతుందన్నారు. జూన్ 12న పున్న ప్రారంభం కావలసి ఉండగా కొన్ని పాఠశాలలో జూన్ 5 నుంచి మొదలు పెట్టారని తెలిపారు.అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. కాలం తీరిన బస్సులు వాడటంతో విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రైవేటు పాఠశాల తీరులో మార్పు రాకపోతే పోరాటాల చేయడానికి వెనకాడబోమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు కళ్యాణ్, సిద్దు పాల్గొన్నారు.

తహసిల్దార్ తో మాట్లాడుతున్న వెంకటేష్

రైతులకు త్వరితగతిన పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో కారిడార్ రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు త్వరిత గతిన పరిహారం చెల్లించాలని పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ కోరారు. సోమవారం సంబంధిత రైతులతో కలిసి తహసిల్దార్ నరసింహమూర్తికి సమస్యను విన్నవించారు. వేంపాడు రెవిన్యూ పరిధిలో కారిడార్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు భూసేకరణ చేపట్టారని, పలువురు రైతులకు పరిహారం చెల్లించాల్సి ఉందని, వెంటనే పరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

జోగుంపేటలో వీధి లైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని జోగుంపేట గ్రామ పంచాయతీలో సర్పంచ్ జువ్వల లక్ష్మీ ఆధ్వర్యంలో వీధి లైట్లు అమర్చారు. లైట్లు మరమ్మతుకు గురవుతుండంతో వాటి స్థానంలో కొత్తవి అమర్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లాలం స్వామి నాయుడు, పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

- జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు

ప్రజాశక్తి- మాడుగుల:నవధాన్యాల సాగుతో భూమి సారవంతంగా తయారవుతుందని జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహనరావు పేర్కొన్నారు. సోమవారం మాడుగుల గ్రామం లో నవధాన్యాల సాగు చేస్తున్న గండి శ్రీనివాసరావు పొలాన్ని మండలం వ్యవసాయ అధికారి వాసుదేవరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలకరిలో నవధాన్యాలు వేయడంతో ప్రధాన పంట కి ఎటువంటి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడనవసరం లేదన్నారు. పురుగులు ,తెగుళ్లు తట్టుకునే శక్తి రావడమే కాకుండా దిగుబడి పెరుగుతుందని, ఖర్చు తగ్గుతోందన్నారు.

ఎండిఎం నిర్వాహకులకు శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మండలంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో ఒకరోజు శిక్షణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా భోజన పథకం నిర్వాహకులు తయారు చేసిన వివిధ రుచికరమైన వంటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నరేష్ మాట్లాడుతూ, మెనూ ప్రకారం ప్రతిరోజు విద్యార్థులకు మంచి ఆహారం అందజేయాలన్నారు. గ్యాస్ స్టవ్ లపై మాత్రమే వంట చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పతివాడ విజయ, సీ.ఆర్.పి.లు అప్పారావు, శేఖర్, గంగేశ్వరరావు, దేవి, జ్యోతి పాల్గొన్నారు.

'నా భర్త మరణంపై విచారణ జరపాలి'

మాట్లాడుతున్న ఉమాదేవి

ప్రజాశక్తి -రావికమతం: మండలంలోని పాత కొట్నాబెల్లి గ్రామానికి చెందిన తన భర్త ఆసరి జగదీష్ మరణం పట్ల పలు అనుమానాలు ఉన్నాయని, పూర్తిస్థాయి దర్యాప్తు జరిపించి తమకు న్యాయం చేయాలని గిరిజన మహిళ ముసలి ఉమాదేవి సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ కు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ, తనకు 8 మే హిందూ సాంప్రదాయం ప్రకారం పాత కొట్నాబెల్లి గ్రామంలో ఆసరి జగదీష్ కు తమకు వివాహం జరిగిందన్నారు. 9 మేన భార్యా భర్తలిద్దరము కలిసి సింహాచలం దేవస్థానానికి వెళ్లి రావడం జరిగిందని ఆమె తెలిపారు. 10న ఉదయం 10 గంటల సమయంలో నలుగురు వ్యక్తులు తమ ఇంటికి వచ్చి నా భర్తను తీసుకు వెళ్లడం జరిగిందని ఆమె తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు తన భర్త బంగారం ఉంగరాలు, బైకు, చెప్పులు, తీసుకొచ్చి అందించడం జరిగిందన్నారు. ఆయన గురించి అడిగితే ఒక్కొక్కరు ఒక్కొక్క సమాధానం చెప్పడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. తన భర్త రక్తపు మడుగులతో క్వారీ గొయ్యిలో శవమై ఉన్నాడని, దీనిపైన సమగ్రమైన దర్యాప్తు జరపాలని ఆమె కోరింది.

సొంత నిధులతో డ్రైయినేజీ పనులు

ప్రజాశక్తి- పాయకరావుపేట:మండలంలోని అరట్లకోట ఎస్సీ కాలనీలో గ్రామస్థులు తమ సొంత నిధులతో డ్రైనేజిని తవ్వించుకున్నారు. గ్రామంలోని మురుగు నీరు ప్రధాన డ్రెయిన్ ద్వారా ప్రవహిస్తూ ఊరు చివర ఉన్న ప్రభుత్వ భూమి (గ్రామ కంఠం) కాలువలోనికి చేరుతుంది. ఈ కాలువను పాయకరావుపేట గ్రామానికి ఓ వ్యక్తి రెండు రోజుల క్రితం జెసిబితో కప్పించారు. దీంతో గ్రామంలో మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. ఈ సమస్యను పరిష్కరించుకొనేందుకు సోమవారం గ్రామస్తులు తమ సొంత నిధులతో జెసిబి తెప్పించుకుని డ్రైన్ లో పేరుకుపోయిన పూడిక, మురుగు తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ పులగపూరి అప్పలనర్స, గ్రామ పెద్దలు మలకా దేవుళ్ళు, కుందూరు కుమార్, విశ్వాసుల వీరబాబు, ఇనపచెప్పుల లోవరాజు, మలకా సామేలు, త్రిపరాల నానిబాబు, వీరబాబు, నక్కా అప్పారావు, రవి పాల్గొన్నారు.

చేపడుతున్న పనులు

కెజిహెచ్‌లో డాక్టర్ వాణి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా అదనపు డిఎంఇ క్యాడర్‌లో ప్రసూతి, స్త్రీల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఐ.వాణి సోమవారం ఆర్థోపెడిక్స్ ప్రొఫెసర్, హెచ్‌ఒడి డాక్టర్ పి.శివానంద నుంచి అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆసుపత్రిలోని ముఖ్య అధికారులు సిబ్బందిలో సిఎస్‌ఆర్‌ఎంఒ డాక్టర్ యు.శ్రీహరి (ఎండి హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్), అడ్మినిస్ట్రేటర్ బి.వి.రమణ, డిప్యూటీ సిఎస్‌ఆర్‌ఎంఒ డాక్టర్ జి.మెహర్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ డి.రాధాకష్ణన్, డాక్టర్ వి.రవి, డాక్టర్ ఎల్.లోకనాథ్‌రావు, డాక్టర్ జి.వాసవి లత, అసిస్టెంట్ డైరెక్టర్ బి.ఎస్.సుమతితో పాటు ఇతర వైద్య, మినిస్టరియల్ సిబ్బంది ఉన్నారు. డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ రోగుల సంరక్షణ, వైద్య ప్రమాణాలను మెరుగుపరచడమే తన లక్ష్యమన్నారు.

సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ వాణి

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో ఉజ్వల్ కేసరికి ఐదో ర్యాంక్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : జెఇఇ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాల్లో విశాఖపట్నం అన్ అకాడమీ విద్యార్థి ఉజ్వల్ కేసరికి ఆల్ ఇండియా ఐదో ర్యాంక్ లభించినట్టు ఆ విద్యాసంస్థ ప్రతినిధి సుమిత్ జైన్ వెల్లడించారు. సోమవారం విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జెఇఇ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాల్లో 4129 మందికి పైగా అన్ అకాడమీ విద్యార్థులు ఉత్తీర్ణులై సరికొత్త చరిత్ర సృష్టించారన్నారు. జెఇఇ ఫలితాల్లో అన్‌అకాడమీ విద్యార్థులు 18 మంది టాప్ 100లోపు, 787 మంది విద్యార్థులు టాప్ ఐదువేలలోపు స్థానాలను సాధించారన్నారు.

బడ్జెట్ స్కూళ్లతోపాటు కార్పొరేట్ విద్యాసంస్థలకు నెలవు!

▸▸ విద్యాపరంగా పురోగమిసున్న పారిశ్రామికవాడ గాజువాక

ప్రజాశక్తి- గాజువాక : పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన గాజువాకలో ప్రస్తుతం విశాఖ నగరానికి దీటుగా అన్ని రకాల విద్యాసంస్థల అందుబాటులోకి వచ్చాయి. ప్రముఖ కార్పొరేట్ విద్యాసంస్థలతో పాటు, పేదలు చదవడానికి బడ్జెట్ పాఠశాలలు గాజువాకలో అందుబాటులో ఉన్నాయి. ఒకప్పుడు కాలేజీ చదువుతోపాటు పోటీపరీక్షల కోచింగ్ తీసుకోవాలంటే 15కిలోమీటర్లు దూరంలో ఉన్న నగరంలోకి వెళ్లాల్సిన పరిస్థితుల నుంచి ఇపుడు అన్ని విద్యాలయాలు గాజువాకలోనే ఉన్నాయి. ఇంకో విషయమేంటంటే, ఇపుడు ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చే పరిస్థితులు కూడా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.

గాజువాకలో మొత్తం 110 ప్రైవేట్ విద్యాసంస్థలు ఉన్నాయి. అందులో 10 వరకు కార్పొరేట్ స్థాయి విద్యాసంస్థలు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టేట్

గాజువాకలో ఉన్న పలు విద్యాలయాలు

సిలబస్, సెంట్రల్ సిలబస్‌లో విద్యాబోధన అందుబాటులో ఉంటుంది. పదోతరగతి నుంచి, తర్వాత కూడా విద్యార్థులకు మెడిసిన్, ఇంజనీరింగ్‌కు సంబంధించిన, ఐఐటి, నీట్, జెఇఇ మెయిన్స్ తరహా విద్యాబోధన ఇక్కడ సాగుతోంది. మరో రెండు కార్పొరేట్ విద్యాలయాల్లో ఇంటర్, డిగ్రీతో పాటు పోస్టుగ్రాడ్యుయేషన్ విద్య కూడా అందుబాటులో ఉంది. ఒకపుడు ఈప్రాంత విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన స్థితి నుంచి ఇపుడు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా విద్యార్థులు ఇక్కడకు వచ్చి హాస్టళ్లలో ఉండి చదువుకునేస్థాయికి నేడు గాజువాక చేరుకుంది. టెన్ ప్లస్ టు తరహా విద్యాబోధన అందుబాటులో ఉన్న షీలానగర్ వికాస్ కాలేజీలో ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా హాస్టల్ సదుపాయంతో చదువుతున్నారు. రెండు నర్సింగ్ కాలేజీలు కూడా గాజువాకలో స్థాపించగా, వాటిల్లో షీలానగర్‌లోని నర్సింగ్ కాలేజీలో నగరంలోని విద్యార్థులు కూడా వచ్చి చదువుతున్నారు. ఇక్కడ చదువు పూర్తిచేసుకున్న విద్యార్థులకు కెజిహెచ్‌తోపాటు ప్రముఖ ఆసుపత్రుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తుండడంతో ఇక్కడ విద్యాబోధనకు మక్కువ చూపడం విశేషం. ఆకాశ్ కోచింగ్ సెంటర్‌లో ఆరో తరగతి నుంచి టెన్త్ వరకు రెగ్యులర్ విద్యతోపాటు ఇంజినీరింగ్, మెడిసిన్ సీట్ సాధనే లక్ష్యంగా నీట్ కోచింగ్ కూడా ఇస్తున్నారు.ఇలా గాజువాక ప్రసిద్ధి విద్యాలయాలకు నెలవుగా మారిందనే చెప్పాలి.

ఇక తక్కువ ఫీజులతో టెన్త్ వరకు నాణ్యమైన విద్యను పేదలకు అందుబాటులోకి తెచ్చే బడ్జెట్ స్కూళ్ల గాజువాక ప్రాంతంలో 92 వరకు స్కూలు ఉన్నాయి. ఈ పాఠశాలను నిర్వహించే వ్యక్తులే అదే పాఠశాల చైర్మన్‌గా, కరస్పాండెంట్‌గానో, లేకుంటే ప్రిన్సిపల్‌గానో వ్యవహరిస్తూ, విద్యార్థులకు ఏదోఒక సబ్జెక్ట్‌ను బోధిస్తూ నిరంతర పర్యవేక్షణతో సమర్ధవంతంగా, ప్రత్యేకశ్రద్ధతో విద్యాసంస్థలను నిర్వహించడం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ విద్యాసంస్థలో కొందరు పేద విద్యార్థులకు ఉచిత విద్యను కూడా సామాజిక బాధ్యతగా అందిస్తున్నారు బడ్జెట్‌స్కూళ్లకు బ్రాంచ్‌లు లేకుండా, ఒకే పాఠశాల కావడంతో నిబద్ధత, ఏకాగ్రతతో పనిచేస్తూ, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ కనబరుస్తూ వారి అభివృద్ధికి దోహదపడుతున్నారు. అందుకే చిన్న ప్రైవేట్ విద్యాసంస్థలు, బడ్జెట్ స్కూళ్లలోనూ కార్పొరేట్ సంస్థలకు ధీటుగా ఉత్తమ ఫలితాలు, ఉత్తీర్ణతాశాతం బాగా పెరిగింది. ఇక ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ విద్యాలయాలు కూడా ఉత్తమ ఫలితాలు, మెరుగైన ఉత్తీర్ణతా శాతం సాధిస్తూ ప్రయివేటు విద్యాసంస్థలకు ధీటుగా ముందుకు సాగుతున్నాయి.